క్లుప్తంగా

రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్‌కు సన్మానం



రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ జార్జ్‌ను సన్మానిస్తున్న ఎస్పీ, పోలీస్ సిబ్బంది

సూర్యాపేట క్రైం : నాలుగు దశాబ్దాల పాటు పోలీసు శాఖలో విధులు నిర్వహించి స్వతంత్ర ఉద్యోగ విరమణ (వీఎల్ఎస్) పొందుతున్న హెడ్ కానిస్టేబుల్ జార్జ్ సేవలు అభినందనీయమని ఎస్పీ బీకే రాహుల్ హెడ్గే అన్నారు. జిల్లాలో పోలీస్ విభాగంలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన జార్జ్‌ను సోమవారం ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్ మీనా, పోలీసు సంఘం అధ్యక్షుడు బెల్లంకొండ రామచందర్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

4న బహిరంగ వేలం

భానుపురి : పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 4వ తేదీన ఉదయం 10 గంటలకు దేవాలయ ప్రాంగణంలో ఏడాది పాటు కొబ్బరికాయల విక్రయం, తలనీలాల సేకరణకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ కార్యనిర్వహణ అధికారి వై. శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు దేవాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9866 025576ను సంప్రదించాలని తెలిపారు.

3న సర్వసభ్య సమావేశం

నూతనకల్ : మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 3న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సునీత తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరై సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆమె కోరారు.

దయాకర్ గుప్తాకు సన్మానం



దయాకర్‌గుప్తాను సన్మానిస్తున్న సభ్యులు

భానుపురి : కాశీ విశ్వేశ్వర స్వామి ఆర్యవైశ్య వాసవీ నిత్య అన్నదాన సత్రం వారణాసి ట్రస్ట్ కమిటీలో జాయింట్ సెక్రటరీగా నియమితులైన సూర్యాపేట పట్టణానికి చెందిన ఈగ దయాకర్ గుప్తాను ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, సురేష్, నూక వెంకటేశం గుప్తా, విద్యాసాగర్ రావు, ప్రకాష్ రావు, గోపాలపు రాజు, రామయ్య, మల్లికార్జున్, గుండా రమేష్, వెంకటేశ్వర్లు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడిని ఆదుకోవాలి

నూతనకల్ : తాటిచెట్టుపై నుంచి పడి గాయపడిన గీత కార్మికుడు బింగి లింగయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్, గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిక్కి బుచ్చయ్యగౌడ్‌లు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం వారు బాధితుడిని ఖమ్మంలోని ఆస్పత్రిలో వేర్వేరుగా పరామర్శించారు.

'చామల' గెలుపు ఖాయం

అర్వపల్లి : భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు ఖాయమని తెలంగాణ ఉద్యమకారుడు, కాంగ్రెస్ నాయకుడు వేముల గోపినాథ్ అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ నాయకుల సమన్వయంతో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిచి తీరుతారని చెప్పారు. కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో పోరాడి జైలు జీవితం గడిపారని తెలిపారు. కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లో మమేకమయ్యారని చెప్పారు. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన కేసాని నర్సింహారావు కుమారుడు కేసాని నితిన్ ఇటీవల అకాల మరణం చెందారు. దీంతో గ్రామ మున్నూరుకాపు స్ఫూర్తి సంఘం ప్రతినిధులు సోమవారం మృతుడి కుటుంబీకులకు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆపదలో ఉన్న వారిని మున్నూరుకాపు స్ఫూర్తి సంఘం ఆధ్వర్యంలో ఆదుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి సంఘం ప్రతినిధులు ఆకుల సోమేష్, కోనేటి వెంకట్, తూడి మహేష్, కోనేటి జానకిరాం, కామిశెట్టి సుధాకర్, ఆకుల రాంబాబు, ఆకుల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న మున్నూరుకాపు స్ఫూర్తి సంఘం సభ్యులు

తాగునీటి సమస్య నివారిస్తాం

- ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నాం
- కలెక్టర్ ఎస్.వెంకటరావు

దురాజ్‌పల్లి : ప్రత్యేక కార్యాచరణతో వేసవిలో జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎస్. వెంకటరావు తెలిపారు. వేసవిలో మంచినీటి సరఫరా, యాసంగి ధాన్యం కొనుగోళ్లు, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ భవనం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లు, అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సూర్యాపేట జిల్లాలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల నోడల్ ఆఫీసర్లుగా ఎంఈఓలను, ఎంఈఓలు లేని చోట సీనియర్ హెచ్ఎంలను ఏర్పాటు చేసి పనులను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో షేడ్ నెట్, ఓఆర్ఎస్, అత్యవసర మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అత్యవసర వైద్య సేవలపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ ప్రియాంక, బీఎస్. లత, డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, జెడ్పీ సీఈఓ వీవీ అప్పారావు, డీఎస్ఓ మోహన్ బాబు, డీఎంహెచ్ఓ కోటాచలం, డీఈఓ అశోక్, సీపీఓ కిషన్‌రావు, మిషన్ భగీరథ ఈఈ ఇంట్రా శ్రీనివాసరావు, గ్రిడ్ అరుణాకర్ రెడ్డి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటరావు, అదనపు కలెక్టర్లు

ఎన్నికల నిర్వహణపై అవగాహన ఉండాలి

తుంగతుర్తి : ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. సోమవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని ఆర్వీఆర్వీ గురుకుల పాఠశాలలో పీఓలకు, ఏపీఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈవీఎంల పనితీరు ఎన్నికల నియమావళిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా మాక్‌పోల్ నిర్వహణ, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌ల ఉపయోగంతో పాటు ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పోలింగ్ బూత్‌లలో సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ చేపట్టాలని అన్నారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు ప్రణాళిక బద్ధమైన కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. ఎన్నికల సంఘం రూపొందించిన మార్గదర్శకాలు, నిబంధనల గురించి స్పష్టంగా తెలుసుకోవాలని కోరారు. అనంతరం ఈవీఎంల పనితీరు, ఎన్నికల నియమావళి, విధులపై మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు రమణారెడ్డి, అమీన్‌సింగ్, డీటీ పీలు, వివిధ శాఖల అధికారులు, పీఓలు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లత

'శాస్త్రవేత్తలతో ముఖాముఖి' పోస్టర్ల ఆవిష్కణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రమేష్‌బాబు తదితరులు

సూర్యాపేటటౌన్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 3న చెకుముకి రాష్ట్ర స్థాయి విజేతలకు అభినందన, శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా అధ్యక్షుడు గోళ్లమూడి రమేష్‌బాబు తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి శాస్త్రవేత్తలతో ముఖా ముఖి కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. చిన్నారుల మనసుల్లో మెదిలే రకరకాల ఆలోచనలకు సరైన రూపం ఇవ్వడానికి, సందేహాల నివృత్తికి శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రభుత్వ పాఠ్య పుస్తకాల రచయిత, జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వరరావు, ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ బి.ఎస్.రెడ్డి, వరంగల్ ఎన్ఐటీ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఏ. రామచంద్రయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వల్లపట్ల దయానంద్, తల్లాడ రామచంద్రయ్య, షేక్ జాఫర్, యాదగిరి, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కమిటీ బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కమిటీ సభ్యులు

చివ్వెంల : సూర్యాపేట బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అధ్యక్షుడిగా నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డపుకు మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా ఎంఎస్వీ వర ప్రసాద్, కోశాధికారిగా ధరావతు వీరేష్ కుమార్, జాయింట్ సెక్రటరీగా పెండెం వాణి, గేమ్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా జిలకర చంద్రమౌలి, లైబ్రరీ సెక్రటరీగా ఎండీ అబ్దుల్ లతీఫ్, ఈసీ సభ్యులుగా డి.వెంకట్ రెడ్డి, కోరిపెల్లి వెంకటేశ్వర్లు, సుంకర రవికుమార్‌లు బాధ్యతలు స్వీకరించారు.

కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- మాజీ మంత్రి దామోదర్ రెడ్డి

భానుపురి : కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని మాజీ మంత్రి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డివిజన్ తాపీ పనివాళ్ల సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కష్టపడే ప్రతి కార్మికుడికి ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందన్నారు. కార్మికుల పక్షాన కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటాలు చేస్తుందని తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు కార్మికులకు చట్టాలతో హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అన్నారు. తన రాజకీయ జీవితంలో కార్మికులతో ఎల్లవేళలా కలిసికట్టుగా పనిచేశానని, ఏ సమస్య వచ్చినా తనవంతుగా సహాయ సహకారాలు అందించానని చెప్పారు. కార్మికులు సంఘాలకు అతీతంగా తమ హక్కుల కోసం పోరాడాలని, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులు, వారి పిల్లల చదువులకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. అనంతరం డివిజన్ తాపి పనివారల సంఘం నూతన అధ్యక్షుడిగా వల్దాస్ శ్రీను (రెబల్)తోపాటు నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గుత్తి నగేష్, ఉపాధ్యక్షుడు ఇరువదిండ్ల అంజయ్య, ప్రధాన కార్యదర్శి కోట శ్రవణ్, సహాయ కార్యదర్శి కుంచం రవి, కోశాధికారి పాలగానే భిక్షం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఆర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

దురాజ్‌పల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్ డిమాండ్ చేశారు. రుణమాఫీ చేయాలని, ఎండిపోయిన వరి పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలని, ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని కోరుతూ సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఏఓ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సారెస్పీ నీరు చివరి ఆయకట్టు వరకు అందించకపోవడంతో కొన్ని మండలాల్లోని వరి పంటలు ఎండిపోయాయని అన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25000 చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ యాసంగి నుంచి క్వింటాకు రూ.500 బోనస్ ఇవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోటు లక్ష్మయ్య, బొడ్డు శంకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, కునుకుంట్ల సైదులు, ఉదయ్ గిరి, కాకి మోహన్ రెడ్డి, దశరథ, నర్సింహారావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీకి ఓటమి తప్పదు

తుంగతుర్తి : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీకి ఓటమి తప్పదని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని దుబ్బాక సంజీవరెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నా, కార్పొరేట్ దోపిడీని అడ్డుకోవాలన్నా బీజేపీని ఓడించాలన్నారు. ఈ సమావేశంలో అగ్రభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కార్యదర్శి పేర్ల నాగయ్య, నర్సయ్య, వేర్పుల లక్ష్మయ్య, కాసర్ల దుర్గయ్య, వేర్పుల కర్ణాకర్, పేర్ల మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎర్ర అఖిల్‌కుమార్

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న పాపారావు

తుంగతుర్తి : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ ప్రభారి పాపారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ ఎన్నికల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ఈ సమావేశంలో పార్లమెంట్ కన్వీనర్ బండారపు లింగస్వామి, బీజేపీ నాయకులు కాప రవి, సంకినేని రవీందర్‌రావు, దొనూరి వీరారెడ్డి, ఉమామహేశ్వరరావు, ప్రియదర్శిని, శ్రీనివాస్, వెంకన్న, మల్లెపాక సాయిబాబా, దీన్‌దయాళ్, భూతం సాగర్, శ్రీనివాస్, గుంటి సతీష్, మధుసూదన్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ



టీకాలు వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి

మద్దిరాల : మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కా ర్యక్రమాన్ని జిల్లా పశువైద్యాధికారి కుమారస్వామి, అసిస్టెంట్ పశువైద్యాధికారి వెంకన్నలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మద్దిరాల మండల పశువైద్యాధికారి ఆసిఫా, ప్రమీలా, గోపాల మిత్రలు నాగెల్లి శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, రైతులు పాల్గొన్నారు.

కోమటిపల్లిలో పశువైద్య శిబిరం

అర్వపల్లి : కోమటిపల్లి గ్రామంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 92 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. రైతులు తప్పనిసరిగా తమ పశువులకు ఈ టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్, సిబ్బంది యాకయ్య, యాదగిరి, గోపాలమిత్రలు కుంభం సురేందర్, ఆల్దాస్ లింగయ్య, ఎస్. అర్జున్, రైతులు అంజయ్య, జాల నర్సయ్య, వల్లపు లింగయ్య, చిర్రబోయిన అంజయ్య, రవి పాల్గొన్నారు.

గోదావరి జలాలు నిలిపివేత

అర్వపల్లి : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) రెండోదశ ఆయకట్టుకు చివరి విడతగా ఇస్తున్న గోదావరి జలాలను సోమవారం నిలిపివేశారు. ఆరో విడత (చివరి తడి) గత నెల 30 వరకు గోదావరి జలాలు రావాల్సి ఉండగా రెండు రోజుల పాటు పెంచారు. అయితే కరీంనగర్‌లోని లోయర్ మానేరు డ్యాం(ఎల్ఎండీ) నుంచి దిగువకు వస్తున్న నీటిని అక్కడి నీటి పారుదల శాఖ అధికారులు నిలిపి వేయడంతో ఇక్కడికి నీళ్లు బంద్ అయ్యాయి. తాగు నీటి ఎద్దడి దృష్ట్యా అక్కడ నీటి విడుదలను నిలిపి వేసినట్లు అధికారులు ప్రకటించారు. కాగా ఎల్ఎండీలో 5 టీఎంసీల నీరు మాత్రమే ఉందని, ఈ నీరు తాగడానికి అవసరం ఉండటంతో సాగు కోసం నిలిపి వేశారు. వర్షాలు పడి ప్రాజెక్టులు నిండితే మళ్లీ జిల్లాకు వచ్చే వానాకాలం సీజన్‌లో నీటిని వదులుతామని ఇక్కడి నీటి పారుదల శాఖ అధికారులు పేర్కొన్నారు.



71డీబీఎం కాలువకు నిలిచిపోయిన నీళ్లు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



అర్వపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



ఆత్మకూర్ (ఎస్) : కందగట్ల గ్రామంలో..

అర్వపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం వలిశెట్టి మల్లేష్ కోరారు. అర్వపల్లి, జాజిరెడ్డిగూడెంలలో సోమవారం ఏర్పాటు చేసిన మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం అమ్ముకుంటే మద్దతు ధర వస్తుందని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో గిర్దావర్ పాటి వెంకట్‌రెడ్డి, సీసీ నగేష్, సంఘబంధం అధ్యక్షులు సునీత, కరుణశ్రీ, వెంకటరమణ, వీఓఏలు కృష్ణకుమారి, సురాంభ, పద్మ, మేకల రాంబాబు, బింగి శ్రీకాంత్ పాల్గొన్నారు.

మద్దిరాల : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ పీడీ సురేష్, తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ అమీన్‌సింగ్, పోలుమల్ల గ్రామంలో అడిషనల్ పీడీ సురేష్‌లు వేరు వేరుగా ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, డీపీఎం ఆంజనేయలు, ఏఓ వికాస్ పాటిల్, ఏఈఓ భవ్యశ్రీ, ఏపీఎం మైసయ్య, సీసీలు నాగార్జునరెడ్డి, రమేష్, వీబీకేలు పాల్వాయి పరశురాములు, రాధిక, రైతులు ఎలిపెద్ది మల్లారెడ్డి, పాక అమృతమల్లు, రవీందర్‌రావు, మహేందర్‌రెడ్డి, శ్యాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి గంట మహేష్, లింగన్న, నాయకులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని మహ్మదాపురం, అనాజీపురం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను, మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అదే విధంగా మండల పరిధిలోని అనంతారంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సీఈఓ ఆలకుంట్ల సైదులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి. కృష్ణసందీప్, ఏపీఎం అజయ్‌నాయక్, సీఈఓ సోమ్లా నాయక్, సీసీ చెన్నయ్య, లక్ష్మారెడ్డి, వీరారెడ్డి, సతీష్, హమాలీ మేస్త్రీ బీంపంగి వెంకన్న, రైతులు కొత్త గంగయ్య, శ్రీను పాల్గొన్నారు.



మద్దిరాల : పోలుమల్లలో..



నాగారంలో..

నాణ్యమైన ధాన్యంతో మద్దతు ధర పొందాలి

నాగారం : రైతులు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలని తహసీల్దార్ బ్రహ్మయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శోభారాణి, సీసీ రామయ్య, జాజుల వీరయ్య, మంగదుడ్ల దశరథ, మహిళా సంఘాల సభ్యులు విజయలక్ష్మి, సుగుణమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : కందగట్ల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ వినోద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని అన్నారు. ఈ విషయంలో అధికారులు, సిబ్బందికి సహకరించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అంజయ్య, ఏఈఓ రాచకొండ శివ కుమార్, సీసీ చందు నాయక్, వీఓఏ లక్ష్మమ్మ, వీఓఏ పద్మ, స్వరాజ్యం, నాగమణి, పుష్ప, రేణుక గ్రామ రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

నూతనకల్ : రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ఆరబెట్టిన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కర్ణాకర్, సీసీలు ముత్తయ్య, ఆర్ఐ ప్రసాద్, సరస్వతి, ఐకేపీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్ : మహ్మదాపురంలో..



నూతనకల్ : గుండ్లసింగారంలో..

పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని కొనసాగించాలి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం గ్రామంలో కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొనసాగించాలని రైతులు జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం గ్రామంలో రైతులు సమావేశమై తీర్మానించారు. కేంద్రాన్ని కొనసాగించాలని కోరుతూ సంతకాల సేకరణ జరిపారు. పీఏసీఎస్ కేంద్రాన్ని నడిపించక పోతే రైతుల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకుడు వజ్జె శ్రీనివాస్, దోరెపల్లి వెంకన్న, వజ్జె సైదయ్య, రమావత్ భీముడు, కర్నాటి మురళి, రమావత్ రాములు, మర్రి నర్సయ్య, సంపతి పున్నయ్య, అంకిరెడ్డి వెంకులు, మర్రి అంజయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

అలుగు ధ్వంసం.. నీళ్లు వృథా

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లి గ్రామ శివారులోని ముత్యాలమ్మ చెరువు అలుగును సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో చెరువులోని నీళ్లు వృథాగా పోతున్నాయి. ప్రస్తుతం ఈ చెరువు నీటితో కళకళలాడుతోంది. వేసవిలో గ్రామానికి మంచినీటి సమస్య తీర్చడానికి చెరువు నీళ్లు ఎంతో ఉపయోగపడనున్నాయి. చెరువు అలుగు ముందు భాగంలో కొన్ని రాళ్లు తొలగించడంతో నీళ్లు అలుగు నుంచి వృథాగా పోతున్నాయి. నీటిని వృథా కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వృథాగా పోతున్న నీళ్లు

'కేసీఆర్‌ది బూటకపు యాత్ర'

నాగారం : మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు చేపట్టింది రైతు భరోసా యాత్ర కాదని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసం చేసిన బూటకపు యాత్ర అని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు యలమకంటి సోమన్నగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్‌కు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని అన్నారు. బీఆర్ఎస్ అవినీతితో మేడిగడ్డ కుంగిందని తెలిపారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై బురద చల్లడం మానుకొని ప్రజాసేవకు పాటుపడాలని సూచించారు.

కాంగ్రెస్ నాయకుడికి నివాళి

నూతనకల్ : మాచనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చవగాని చంద్రమౌళి మృతి పార్టీకి తీరని లోటని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన చంద్రమౌళి చిత్రపటానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన కల్లెం కృష్ణారెడ్డి, చవగాని విజయ్, బంటు బద్రి, సురుగు రామచంద్రు, వీరబోయిన వెంకన్న, బొల్క సైదులు ఉన్నారు.